క్లుప్తంగా

శాలిగౌరారంలో భారీ వర్షం

శాలిగౌరారం: మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలో 65.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షం వల్ల బీడు భూముల్లో నీరు నిలిచింది. సుమారు రెండు గంటలకు పైగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు వరదలా ప్రవహించింది. భారీ వర్షం వల్ల మండలంలో సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ఇదిలా ఉండగా మెట్ట పంటల సాగుకు సరిపడా సాలేటి వాన కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా వరినార్లు పోసుకునేందుకు రైతులకు ఈ వర్షం ఎంతో మేలు చేసింది.

కార్యకర్తలకు అండగా బీజేపీ

చండూరు: కార్యకర్తలకు బీజేపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డా. నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. చండూరు మున్సిపల్ కేంద్రానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు, హనుమాన్ సేవా సమితి మండల అధ్యక్షులు చిలుకూరి పరమేష్ బాబు ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను వర్షిత్‌రెడ్డి సోమవారం పరామర్శించి పార్టీ తరఫున సేకరించిన రూ.70 వేల నగదును అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమ నరసింహ, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కోమటి వీరేశం, మున్సిపల్, మండల అధ్యక్షులు పందుల సత్యంగౌడ్, ముదిగొండ ఆంజనేయులు, సీనియర్ నాయకులు తడకమల్ల శ్రీధర్, శ్రీహరి, ఓంకారం, సముద్రాల వెంకటేశ్వర్లు, గణేశ్, ఆంజనేయులు, నరేష్, శేఖర్, ఓంకారం, భూతరాజు స్వామి, శివర్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నివాళి



కొలను వెంకట్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్ : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి పెద్ద బావ కొలను వెంకట్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. హైదరాబాద్‌లోని చైతన్యపురిలో జరిగిన ఆయన అంత్యక్రియల్లో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, దైద రవీందర్ పాల్గొని నివాళులర్పించారు.

పాస్టర్ల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మర్రిగూడ: నియోజకవర్గ పాస్టర్ల కమిటీ అధ్యక్షుడు పోగుల విజయ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో మండల పాస్టర్ల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జి.ప్రకాశ్, ఉపాధ్యక్షుడిగా డి.సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా కె.హనన్యపాల్‌రాజ్, సహాయ కార్యదర్శిగా సీహెచ్.సామియేల్, ట్రెజరర్‌గా అబ్రహం, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఏసురత్నం, అర్నాల్డ్, అడ్వైజర్‌గా జోసఫ్, సభ్యులుగా ప్రకాశ్, రమేష్, అబ్రహంలను ఎన్నుకున్నారు.

ముగిసిన బీజేపీ నాయకుడి అంత్యక్రియలు

మునుగోడు: మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కూరెళ్ల వెంకటఉదయకృష్ణ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం ఆ గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. వివిధ పార్టీల, సంఘాల నాయకులు హాజరై ఉదయకృష్ణ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మాజీ చైర్మన్ పల్లె రవికుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి, బొగ్గు నాగరాజుగౌడ్, పోగుల ప్రకాష్, ఐతగోని లాల్‌బహదూర్‌గౌడ్, బొడిగే అశోక్ గౌడ్, మాదగోని నరేందర్, సాగర్ల లింగస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులపై వివక్ష తగదు

చిట్యాల: ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాల ఆహ్వానం విషయంలో వివక్ష తగదని తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యమంలో పాల్గొని జైలుకెళ్లి, ఆర్థిక, అనారోగ్య ఇబ్బందులకు గురైనప్పటికీ తనలాంటి ఎందరో ఉద్యమకారులకు దశాబ్ది ఉత్సవాలకు ఆహ్వానం అందకపోవడం శోచనీయమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు రెండు వందల గజాల ఇంటి స్థలంతోపాటు నెలనెలా పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి : మండలంలోని దేవత్‌పల్లి గ్రామానికి చెందిన ముదిగొండ నర్సింహ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా సోమవారం కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బత్తుల విజయ్ ఆస్పత్రిలో నర్సింహను పరామర్శించి రూ. ఐదువేల ఆర్థిక సహాయం అందజేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలేవి !

- మూలమలుపుల్లో కనిపించని సూచిక బోర్డులు
- ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న వాహనదారులు
- నివారణ చర్యలు చేపట్టని అధికారులు



ప్రమాదంలో గాయపడిన యువకులు (ఫైల్)



ప్రమాదంలో గాయపడిన యువకుడు (ఫైల్)

మర్రిగూడ : రోడ్డుపై ప్రయాణం చేయాలంటే జంకాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. సరైన దారిలో ప్రయాణిస్తున్నా ఎదురుగా లేదా వెనుక నుంచి వచ్చే వారి అజాగ్రత్త కారణంగా అమాయకులు ప్రమాదాలకు గురై మృత్యువాత పడడంతో ఆ కుటుంబాలు వీధిన పడుతున్నాయి. మర్రిగూడ మండలంలో గత నాలుగు నెలలుగా జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృత్యువాత పడ్డారు.

పలు ప్రమాదాలు..

మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పగిళ్ల వెంకటేష్ మర్రిగూడకు బైక్ మీద సరైన మార్గంలో వెళ్తున్నప్పటికీ మద్యం సేవించిన వ్యక్తి ద్విచక్రవాహనంపై ఎదురుగా వచ్చి బలంగా ఢీకొట్టడంతో ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డాడు. యాచారం మండలానికి చెందిన భార్యభర్తలిద్దరూ వట్టిపల్లి గ్రామంలో ఒక తోట కౌలుకు తీసుకుని సాగు చేస్తుండేవారు. బైక్‌పై తిరుగు ప్రయాణంలో తిరగండ్లపల్లి సమీపంలో రోడ్డు ప్రమాదానికి గురై మృత్యువాత పడ్డారు. అదేవిధంగా నర్సిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన తల్లీకొడుకులు ద్విచక్ర వాహనంపై ఓ శుభకార్యానికి వెళ్లి వస్తుండగా రాంరెడ్డిపల్లి బస్టాండ్ సమీపంలో కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి తల్లి మృతి చెందింది. తిరగండ్లపల్లి మూలమలుపు వద్ద రాజాపేటతండా సమీపంలో మూలమలుపు వద్ద అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఇటీవల రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు.

నిబంధనలు పాటించని వాహనదారులు

మద్యం మత్తులో వాహనాలను నడుపుతూ కొందరు ప్రమాదాలకు కారణమవుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రాంగ్‌రూట్‌లో ప్రయాణిస్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అదేవిధంగా సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తుండడం వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయి. మైనర్లు వాహనాలు నడిపి ఏదైనా ప్రమాదం సంభవిస్తే వారి తల్లిదండ్రులకు శిక్ష పడుతుందని మరిచిపోతున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై సంబంధిత శాఖ అధికారులు ఎక్కడా వాహనదారులకు అవగాహన కల్పించడం లేదు.

కనిపించని సూచిక బోర్డులు...

మూలమలుపులు, కల్వర్టులు, బ్రిడ్జిలు, ఎత్తుపల్లాలు, పాఠశాలల వద్ద, అధికంగా ప్రమాదాలు జరిగే ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. కానీ మర్రిగూడ మండలంలో అలాంటి సూచిక బోర్డులు ఎక్కడా కనిపించడం లేదు. రహదారి వెంట అక్కడక్కడ చెట్లు ఏపుగా పెరగడంతో వాహనాలను రాకపోకలను గుర్తించడం కూడా కష్టతరమవుతుంటుంది. సంబంధిత శాఖల అధికారులు స్పందించి రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టడంతోపాటు సంబంధిత శాఖ అధికారులు వాహనదారులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చొరవ చూపాలి



తిరగండ్లపల్లి గ్రామ సమీపంలో మూలమలుపు వద్ద పలుమార్లు రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అక్కడ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిపాలైన వారు అనేక మంది ఉన్నారు. ప్రమాదాలు చోటుచేసుకునే చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తే వాహనదారులను ప్రమాదాల నుంచి కొంత మేర కాపాడవచ్చు.

– అల్వాల జంగయ్య, తిరగండ్లపల్లి

అవగాహన ఉండాలి



అతివేగం, మైనర్లు డ్రైవింగ్ చేయడం, లైసెన్స్ లేని వారు వాహనాలను నడిపితే వెహికల్ ఓనర్‌పై కేసులు నమోదు చేస్తాం. అవగాహన లేని వారు వాహనాలను నడిపడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మద్యం సేవించి వాహనాలను నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలి.

–కె.రంగారెడ్డి, ఎస్‌ఐ

కంఠమహేశ్వర స్వామి ఆలయంలో పూజలు



పూజలో పాల్గొన్న పల్లె రవికుమార్

చండూరు : గట్టుప్పల్ మండల కేంద్రంలో గల కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు బండారు చంద్రయ్య, టీసీఎస్ అధ్యక్షుడు పెద్దగోని కుమార్‌గౌడ్, కర్నాటి అబ్బయ్య, పెద్దగోని యాదయ్య గౌడ్, రాఘవేందర్‌గౌడ్, సింగిల్ విండో డైరెక్టర్ చెరుపెల్లి ఆంజనేయులు, డాక్టర్ దంతూరి సాయిలు, సందీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప ఆలయంలో ..

గట్టుప్పల్ మండల కేంద్రంలో బీరప్ప ఆలయంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి క్యామ మల్లేష్, రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకందారుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజు, వలిగొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొనపురి కవితలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మంగ వెంకటేష్, బీరప్ప గొర్రెల పెంపకందార్ల అధ్యక్షుడు కుండె సత్తయ్య, కురుమ సంఘం అధ్యక్షుడు కుండె శ్రీశైలం, మందుల నరసింహ, బండ వేణు, బొడిసె శ్రీశైలం, చంద్రయ్య కులపెద్దలు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో రాణించాలి



ఉరుమడ్లలో హాకీ శిక్షణ పూర్తి చేసుకున్న క్రీడాకారులు

చిట్యాల: యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న క్రీడా శిబిరాల్లో శిక్షణ పొందిన క్రీడాకారులు జిల్లా స్థాయి క్రీడల్లో రాణించాలని జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి మక్బూల్ అహ్మద్ అన్నారు. ఉరుమడ్ల గ్రామంలో యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత హాకీ క్రీడా శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. క్రీడలు ఆడడం వల్ల శారీరకంగా, మానసికంగా ధృడంగా తయారవుతారని, రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించే క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. అనంతరం క్రీడాకారులకు శిక్షణ పత్రాలను ఆయన అందజేశారు. అదేవిధంగా శిక్షణ పొందిన క్రీడాకారులకు జెడ్పీటీసీ సుంకరి ధనమ్మయాదగిరిగౌడ్, ఎంపీటీసీ పెద్దబోయిన సత్తయ్య యాదవ్ సాక్స్‌లు అందజేశారు. కోచ్ గంగాపురం రాము, కొండ పరమేష్, మర్రి కల్పన, కిషన్, కొయ్యడి సత్యనారాయణ, సాగర్ల వెంకటేష్, శేఖర్, ఉయ్యాల నాగరాజు, వెలుగు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సంస్థాన్ నారాయణపురం: మండలంలోని సర్వేల్ గురుకుల పాఠశాలలో 10వ తరగతి వరకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటేశం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా స్టాఫ్ నర్స్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు.

బైపాస్ రోడ్డు నిర్మాణంతోనే నల్లగొండ అభివృద్ధి

నల్లగొండ టౌన్ : నల్లగొండ పట్టణం మధ్యలోనుంచి కాకుండా బైపాస్ రోడ్డు నిర్మించడం ద్వారానే పట్టణం అభివృద్ధి చెందుతుందని సీపీఎం నాయకులు సయ్యద్ హాశం, ఎండీ.సలీం అన్నారు. సోమవారం దొడ్డి కొమరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రిటైర్డు ఉద్యోగులు, వ్యవసాయదారులు, పిల్లల భవిష్యత్ కోసం కొనుగోలు చేసిన ప్లాట్లకు నష్టం జరగకుండా వ్యవసాయ భూములను మాత్రమే సేకరించే విధంగా ప్రతిపాదన చేయాలన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాకుండా ప్రజలకు మేలు జరిగే విధంగా బైపాస్ రోడ్డు అలైన్‌మెంట్ సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో దండంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, అద్దంకి నరసింహ, కుంభం కృష్ణారెడ్డి, అలీ పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో రాణించాలి



విజేతలకు బహుమతి అందజేస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. వారం రోజులుగా పట్టణంలో నిర్వహించిన దేవరకొండ ప్రీమియర్ లీగ్ సీజన్-3 జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. నేటి యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. టోర్నమెంట్‌లో మొత్తం 32టీంలు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మారుపాకుల సురేష్‌గౌడ్, ఎంఏ సిరాజ్‌ఖాన్,పున్న వెంకటేష్,కిన్నెర హరికృష్ణ, వెంకటేష్‌గౌడ్, నిర్వాహకులు హన్మంతు సాయిచంద్ర, కార్తీక్, రమేశ్, నందు, అభిషేక్, తదితరులున్నారు.

ఘనంగా బొడ్రాయి వేడుకలు

మిర్యాలగూడ : మండలంలోని సామగానితండాలో బొడ్రాయి మహోత్సవంసోమవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని బొడ్రాయికి పూజలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



బొడ్రాయికి పూజలు చేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

అతి చిన్న వయస్సులో వేదవిద్యలో పట్టా



లక్ష్మీవైష్ణవ్‌ను అభినందిస్తున్న బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు

నకిరేకల్: మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన సుద్దాల లక్ష్మీవైష్ణవ్ అతి చిన్న వయస్సులో వేదవిద్యలో మూలం పట్టా పొందాడు. లక్ష్మీవైష్ణవ్ గుంటూరులో వేదవిద్య పాఠశాలలో శ్రీకృష్ణ యజుర్వేదంలో శిక్షణ పొందాడు. ఐదు సంవత్సరాలు జరిగే శిక్షణలో మొదటి సంవత్సరం పూర్తి చేసి మూలం పట్టా పొందాడు. ఈ సందర్భంగా విద్యార్థి లక్ష్మీవైష్ణవ్‌ను సోమవారం రాత్రి నకిరేకల్‌లోని ఐశ్వర్యసాయి మందిరంలో గాయత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నకిరేకల్ మున్సిపల్ కమిషనర్ బాలాజీ, ఏవీఎం విద్యా సంస్థల ఫౌండర్ కందాల పాపిరెడ్డి, వైద్యులు గౌతమ్‌రెడ్డి, సుష్మా, గాయత్రి వైదిక బ్రాహ్మణ పరిషత్ అధ్యక్షుడు పగిడిమర్రి వెంకటేశ్వరశర్మ, బ్రాహ్మణ పరిషత్ ప్రతినిధులు మధుసూదనశర్మ, దుర్గి మురళి, వావిలాల రామలింగశర్మ, లక్ష్మిప్రసాద్‌శర్మ, ఫణిశర్మ, త్రినేత్ర, నవీన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల దినసరి వేతనం పెంచాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మాడుగులపల్లి : ఉపాధి హామీ కూలీల దినసరి వేతనం రూ. 300లకు పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మన్నెం భిక్షం, గండమళ్ల రాములు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వారు పర్యటించి కూలీల సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ స్వామికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పని కల్పించాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తుందని ఆరోపించారు. ఏటా పథకానికి నిధులు తగ్గిస్తూ పేదలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. పథకాన్ని రద్దు చేసి వలసలను ప్రోత్సహించేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, కార్యదర్శి వెంకటయ్య, నాగయ్య, కృష్ణయ్య, వంశీకృష్ణ, శ్రీను, వెంకన్న, ఆంజనేయులు, పవన్, బిందు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కట్టంగూర్ : విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మండలంలోని మునుకుంట్ల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు ఊట్కూరి శంకరయ్య తన గేదెను గ్రామ శివారులో మేపుతుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ఎర్త్ వైర్‌కు విద్యుత్ ప్రవహించడంతో గేదె ఎర్త్ వైర్‌కు తగులుకుని విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి తనను ఆదుకోవాలని కోరారు.

రేపటి నుంచి లక్ష్మీతిరుపతమ్మ గోపయ్య స్వామి జాతర

వేములపల్లి : ఈనెల 5వ తేదీ నుంచి శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి జాతరను నిర్వహించనున్నట్లు ఆలయ అధ్యక్ష, కార్యదర్శులు జిన్న నాగిరెడ్డి, అవిరెండ్ల వేణులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని రావులపెంట గ్రామంలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్యస్వామి వారి 14వ కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జాతర సందర్భంగా ఈనెల 5, 6 తేదీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కోటీల పోటీలు, 6న సుప్రభాత సేవ, మంగళ తోరణాలు, విగ్రహాలకు అభిషేకాలు, 7న అమ్మవారికి బోనాలు, కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. మిర్యాలగూడ, సూర్యాపేట డిపోల నుంచి బస్సులను నడపనున్నట్లు తెలిపారు.

ఆలయం వద్ద విక్రయాలకు వేలం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని కల్లెపల్లి బంగారు మైసమ్మ ఆలయం వద్ద 2024–25 సంవత్సరానికిగాకి లడ్డూ, పులిహోరా, తలనీలాలు, కొబ్బరికాయలు విక్రయించుకునేందుకు ఈ నెల 7న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ ధీరావత్ భాష్యానాయక్, ఆలయ కార్యనిర్వహణాధికారి గుజ్జుల కొండారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొబ్బరికాయలు, దున్నపోతులు సేకరించుకునే హక్కుకు రూ.లక్ష డిపాజిట్, పూలదండలు, నిమ్మకాయలు, కొబ్బరిచిప్పలు సేకరించుకునే, తలనీలాలు సేకరించుకునే, లడ్డూ ప్రసాదం అమ్ముకునే హక్కులకు రూ.50వేల డిపాజిట్ చెల్లించాలని వారు పేర్కొన్నారు.

కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చౌటుప్పల్ : కుట్టు శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణ కేంద్రంలో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శిక్షణ తీసుకుంటున్న మహిళలకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మూర్తి, మంగ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులుగా నిలిచిన విద్యుత్ సరఫరా

- వరినార్లు పోసుకోలేక రైతుల ఇబ్బందులు
- విద్యుత్ సిబ్బంది పట్టించుకోవడం లేదని ఆరోపణ



రామగిరిలో గురుజాల రోడ్డువెంట పశువైద్యశాల సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

శాలిగౌరారం: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెడ్ ఫ్యూజ్ పోవడంతో నెలరోజులుగా ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో వరిపంట సాగు సీజన్ ప్రారంభమైనా నారుమడులను సిద్ధం చేసుకోలేక విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని 20 మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. శాలిగౌరారం-గురుజాల ప్రధానరోడ్డు వెంట రామగిరి గ్రామంలో మండల పశువైద్యశాల సమీపంలో ఎస్ఎస్–2 నంబర్ కలిగిన 100 హెచ్‌పీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో 20 వ్యవసాయ బావులు, బోర్లకు సంబంధించిన విద్యుత్ వ్యవసాయ మోటార్లు పనిచేస్తున్నాయి. నెల రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్‌పై హెడ్ ఫ్యూజ్ పోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి 11 కేవీ విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసిన తర్వాత మాత్రమే హెడ్‌ఫ్యూజ్ వేసేందుకు వీలుంటుంది. నెలరోజులుగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెడ్‌ఫ్యూజ్ వేయాలని సంబంధిత సిబ్బందికి విన్నవిస్తున్నా పట్టించుకోవడంలేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద హెడ్‌ఫ్యూజ్ వేయడంతోపాటూ ఏవి స్విచ్‌ను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ కంపచెట్లు పెరిగిపోయాయని, కంపచెట్లు విద్యుత్ తీగలకు తగలడంతో షార్ట్‌సర్క్యూట్ జరిగి హెడ్‌ఫ్యూజ్‌లు పోతున్నాయని విద్యుత్ సిబ్బంది వివరించారు. ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కంపచెట్లు తొలగించాలని రైతులకు ఎన్నిమార్లు చెప్పినా ఒక్కరు కూడా ముందుకు రావడంలేదన్నారు.

ఇష్టానుసారంగా తాటి-చెట్ల నరికివేత

- అధికారుల ఆదేశాలు పట్టించుకోని 'రియల్' వ్యాపారులు
- మునుగోడు మండలంలో తగ్గిపోతున్న తాటి వనాల సంఖ్య



మునుగోడు గ్రామ పంచాయతీ పరిధిలోని చండూరు-మునుగోడు రోడ్డు పక్కనే నరికివేసిన తాటి చెట్లు

మునుగోడు: గీత కార్మికులకు ఉపాధినిచ్చే తాటి చెట్లను మునుగోడు మండల వ్యాప్తంగా ఇష్టానుసారంగా నరికివేస్తున్నారు. ఓ పక్కన ప్రభుత్వం హరితహారంలో భాగంగా తాటి, ఈత చెట్లను నాటి సంరక్షించాలని అధికారులను ఆదేశిస్తుంటే మరో పక్కన రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రైతులు వ్యవసాయ భూముల్లోని తాటి చెట్లను విచ్చలవిడిగా నరికివేస్తున్నారు. దీంతో మండల వ్యాప్తంగా రోజురోజుకూ తాటి వనాల సంఖ్య భారీగా తగ్గిపోతోంది. అయినా సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

అనుమతి తీసుకునే విధానం ఇలా..

ప్రభుత్వ నిబంధన ప్రకారం ఎవరైనా రైతు లేదా ఇతర వ్యక్తులు తమ వ్యవసాయ భూమిలో తాటి చెట్లు ఉంటే దానిని తొలగించుకునేందుకు అధికారులు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి. అందుకు ముందుగా రూ. వేయి రూపాయల డీడీ జిల్లా కలెక్టర్ పేరున తీయాల్సి ఉంటుంది. ఆ డీడీతో పాటు ఒక దరఖాస్తును కలెక్టర్‌కు అందజేస్తే ఎక్సైజ్ అధికారులకు కలెక్టర్ సూచనలు చేస్తారు. వారి సూచనల ప్రకారం ఆ చెట్లను నరికివేయాల్సి ఉంటే వాటి అన్నింటినీ లెక్కించి ఒక్కో చెట్టుకు అధికారులు నిర్ణయించిన నగదు డీడీ రూపంలో చెల్లిస్తే వాటిని నరికివేసేందుకు అధికారులు అనుమతి ఇస్తారు. కానీ మునుగోడు మండలంలో ఇలా ఏ ఒక్కరూ అనుమతి తీసుకోకుండా విచ్చలవిడిగా తాటి చెట్లను నరికివేస్తున్నారు. అలా మండల వ్యాప్తంగా ఈ ఏడాది దాదాపు 5వేలకు పైగా తాటి చెట్లను నరికివేసినట్లు ఆయా గ్రామాల గీత కార్మికులు ఆరోపిస్తున్నారు.

కేసులు నమోదు చేసింది మూడు

మునుగోడు మండల వ్యాప్తంగా ఒక్కో గ్రామంలో దాదాపు ముగ్గురి నుంచి 10 మంది వరకు తమ వ్యవసాయ భూముల్లోని చెట్లను నరికివేశారు. అలా మండల వ్యాప్తంగా దాదాపు 150 మందికి పైగా తాటి చెట్లను ఇటీవల నరికివేసినట్లు అంచనా. కానీ వారి అందరిపై సంబంధిత అధికారులు కేసులు నమోదు చేయకుండా కేవలం మూడు కేసులు మాత్రమే నమోదు చేసి చేతులు దులుపుకున్నారు. అది కూడా గ్రామస్తులు లేదా పక్కన భూమి యజమానులు ఫిర్యాదు చేస్తేనే ఆ కేసులు నమోదు చేశారు. కానీ ప్రతి గ్రామంలో ప్రధాన రహదారుల వెంట వందల చెట్లను నరికివేసిన దృశ్యాలు ఆ సిబ్బంది కంటికి కనిపించినా కనీసం వాటిని ఎందుకు నరికివేశారని ప్రశ్నించిన పాపాన పోలేదని ఆయా గ్రామాల గీత కార్మికులు ఆరోపిస్తున్నారు. సంబంధిత శాఖకు చెందిన ఉన్నత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని మునుగోడు మండలంలో తాటి, ఈత చెట్లను నరికివేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుని, తాటి, ఈత వనాలను సంరక్షించాలని మండలంలోని గీతకార్మికులు కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు



తాటి చెట్లను నరికివేస్తున్నా సంబంధిత అధి కారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారుల అనుమతి లేకుండా మండలంలోని ప్రతి గ్రామంలో వందల చెట్లను నరికివేస్తున్నారు. రోజురోజుకూ తాటి వనాల సంఖ్య తగిపోయి రానున్న రోజుల్లో గీత కార్మికులకు ఉపాధి కరువైపోతుంది. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకొని అనుమతులు లేకుండా తాటి చెట్లను నరికివేసే వాళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

– వనం వెంకన్న, గీత కార్మిక సంఘం మండల కార్యదర్శి